
శంబర జాతర సందడి..


విద్యుత్ కాంతుల నడుమ వనంగుడి

ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వనంగుడి, చదురుగుడి విద్యుత్‌కాంతులతో ధగధగలాడాయి. వనంగుడి వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లను ఆర్డీఓ హేమలత పరిశీలించారు. పలువురు భక్తులు తమ చిన్నారుల తలనీలాలు సమర్పించారు. మూడు రోజులు జరగనున్న జాతరలో పలు దుకాణాలు, సర్కస్‌లు వెలిశాయి.

– మక్కువ


తలనీలాలు సమర్పించుకుంటున్న చిన్నారి


సిద్ధమైన లడ్డూలు


క్యూలైన్లు పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత


జాతరలో వెలిసిన దుకాణాలు


రంగులరాట్నం, జంపింగ్ వాల్

క్లుప్తంగా

చిలకలపల్లి విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బలిజిపేట: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో చిలకలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.గౌరీశంకర్, పీడీ గణేష్‌కుమార్, సహా ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో ఈ నెల 20, 21వ తేదీలలో జరిగిన పోటీలలో తమ పాఠశాల విద్యార్థినులు కె.పావని, జి.సౌమ్యలు ఉమ్మడి విజయనగరం జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి 4 x 100 మీటర్స్ రిలేలో ద్వితీయస్థానం సాధించినట్టు పీడీ గణేష్‌కుమార్ తెలిపారు.

సుభాష్ చంద్రబోస్‌కు నివాళులు


పెదపెంకిలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యువత

బలిజిపేట: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పెదపెంకి నేతాజీ గ్రంథాలయం వద్ద ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ గొప్ప వ్యక్తి అని స్వాతంత్య్ర పోరాటంలో ఎంతో చురుకైన పాత్రపోషించారని కొనియాడారు. అటువంటి మహనుభావుని స్మరించుకోవడం మన అందరి అదృష్టమన్నారు. కార్యక్రమంలో జి.శ్రావణ్‌కుమార్, ఎం.శ్రీనివాస్, జి.ప్రసాద్, సీహెచ్. వెంకటనాయుడు యువకులు పాల్గొన్నారు.

సాలూరులో...


నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

సాలూరు: పట్టణంలోని వైఎస్సార్ కూడలి వద్ద సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి భగత్‌సింగ్ యువజన సేవాసంఘం, అఖిల భారత విద్యార్థి పరిషత్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సోమవారం నేతాజీ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నేతాజీ గొప్పతనం, వీరత్వాన్ని వివరించారు.

85మందికి ఉచిత నేత్ర వైద్యపరీక్షలు



నారాయణపురంలో వైద్య పరీక్షలు చేస్తున్న ఆప్థాలమిస్ట్ సత్యవతి

బలిజిపేట: మండలంలోని నారాయణపురంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో సోమవారం 85మందికి వైద్య పరీక్షలు చేశారు. ఆంధ్రప్రదేశ్ క్రాఫ్ట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించగా 35మంది శస్త్ర చికిత్సకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. వారిని విశాఖలోని శంకర్ ఐ ఫౌండేషన్‌కు తీసుకువెళ్లి శస్త్ర చికిత్సలు పూర్తిచేసిన తరువాత తిరిగి నారాయణపురం గ్రామానికి చేర్చనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిల్ చైర్‌పర్సన్ అమ్మాజీనాయుడు, ఉషారాణి, పద్మజ, క్యాంప్ కోఆర్డినేటర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ ప్రసాద్

సాలూరు: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో ఆర్టీసీ డిపో ఆవరణలో డ్రైవర్లు, ప్రయాణికులు, ఆటోవాలాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అతివేగం పనికాదని.. అలాగే మద్యం మత్తులో డ్రైవింగ్ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

గ్రామదేవతకు పూజలు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో నిర్మించిన గ్రామదేవత పేరంటాల గుడి ప్రతిష్ఠోత్సవం సోమవారం నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. గుంపమ్మ గుడి నిర్మాణానికి ఆర్థిక సహకారం అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ బి. కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: మండలంలోని జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడానికి ఇంజినీరింగ్ సహాయకులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ జానకీరాం అధ్యక్షతన సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణ మహేష్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టడానికి నీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యాలు కల్పించడం, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి ప్రభుత్వం వెలుగు ఆధ్వర్యంలో రూ.35 వేల రుణ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. అలాగే సిమెంట్, ఇనుము, గృహోపకరణాల సరుకులు తక్కువ ధరకు సమకూర్చినట్లు తెలిపారు. ఈ విషయాలపై ఇంజినీరింగ్ సహాయకులు లబ్ధిదారులకు అవగాహన కల్పించి సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి వారి సొంతింటి కల సాకారమయ్యేలా చేయాలని కోరారు. హౌసింగ్ ఏఈ జానకీరాం మాట్లాడుతూ మండలానికి 2,640 ఇళ్లు మంజూరయ్యాయని, ఇప్పటికి 1,120 పూర్తయ్యాయని వివిధస్థాయిల్లో 614 ఇళ్లు ఉన్నాయని తెలియజేశారు. మిగిలిన లబ్ధిదారులు పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. నిర్మానం ప్రారంభించని లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మేలైన పంటల సాగుకు అవగాహన కల్పించాలి


వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇస్తున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: మేలైన వ్యవసాయ పద్ధతులను క్లస్టర్ శిక్షణ కార్యక్రమలో వ్యవసాయ సహాయకులు అవగాహన కల్పించుకుని రైతులకు తెలియజేయాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. క్లస్టర్ శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం ఆర్. వెంకంపేట గ్రామంలో క్లస్టర్ వారీగా రైతులకు గ్రామ వ్యవసాయ సహాయకులతో పాటు ఏఓ ఎస్.అవినాష్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాల్లో వినియోగించాల్సిన ఎరువులు, పురుగుమందుల వాడకంపై రైతులు అవగాహన కల్పించుకోవాలని సూచించారు. విచక్షణా రహితంగా పురుగు మందులు వాడడం మంచిది కాదని, తగిన మోతాదు కంటే ఎక్కువగా వినియోగించడం వల్ల పండించిన పంట రసాయనాలతో కూడి ఉంటుందని, పురుగు మందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వేపకషాయం వంటి వాటిని వాడుతూ నివారణా చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. అపరాలు పంటల పూర్తి సాగు విధానాలను అందులోని మెలకువలను తెలియచేశారు. పొలం పరిసరాల విశ్లేషణలో భాగంగా అపరాలు పంటలకు అనువైన భూమి, దానికి ఉండే నీటి వనరులు, అందులో ఉండే వివిధ రకాల మిత్ర, శత్రు పురుగులు పొలం చుట్టూ ఉన్న వాతావరణాన్ని విశ్లేషించి పొలంబడి ద్వారా వివరించారు. మిత్ర పురుగుల వల్ల కలిగే లాభాలు, వాటి రక్షణ చర్యల గురించి చర్చించారు. పంట మొక్కల ఆరోగ్య పరిస్థితులను ఎలా గమనించాలి, మొక్కలో ఏదైనా పోషక లోపాలు ఉన్నాయా, తెగులు ఉందా? తదితర విషయాలు క్షుణ్ణంగా అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మరోసారి జగనన్నను సీఎంగా ఆశీర్వదించాలి

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. మండలంలోని లక్ష్మీపురంలో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే జోగారావుకు సర్పంచ్ టి సత్యవతి, ఉపసర్పంచ్ వై.వెంకటనాయుడు, ఎంపీటీసీ టి. పార్వతమ్మ, నాయకులు చప్ప సురేష్, పి రాము, అప్పలనాయుడు, గ్రామపెద్దలు కలిసి ఘనంగా ఆహ్వానం పలికారు. అనంతరం గడప గడపకు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జోగారావు ప్రారంభించి ప్రతి గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందచేసి ప్రభుత్వం నుంచి పొందుతున్న సంక్షేమ పథకాలన్నీ సవ్యంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సంక్షేమ పథకాలు పొందడానికి అర్హతులుంటే వివరాలు తెలుసుకుని సచివాలయం ఉద్యోగులతో అక్కడికక్కడే నమోదు చేయించి పరిష్కరించాలని ఆదేశించారు.అదేవిధంగా గ్రామంలో సామాజిక పరమైన సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి పూర్తి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పోల ఈశ్వరనారాయణ, వై గోపాలనాయుడు, పువ్వల అప్పారావు, డీసీసీబీ డైరెక్టర్ అంబటి కృష్ణంనాయుడు, మాజీ ఎంపీపీ కె.రత్నాకర్, ఎంపీటీసీలు వై అరుణకుమారి, వై గౌరీశ్వరి, జి.సంతోషి కుమారి, ఎస్ నిర్మల, జి.బుజ్జి, పలుగ్రామాల సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులు మండల స్థాయి అధికారులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పురుషులకు పొదుపు రుణాలు


రుణం అందిస్తున్న మేనేజర్ సుందరరావు

సాలూరు: పొదుపు సంఘాల్లో గల మహిళలకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరవడం సర్వసాధారణం. అయితే పట్టణంలో 50 ఏళ్లలోపు గల పలువురు దినసరి వేతనదారులు పొదుపు సంఘంగా ఏర్పడ్డారు. దీంతో వారికి డీసీసీబీ బ్యాంక్‌లో మెప్మా ఆధ్వర్యంలో సోమవారం పొదుపు రుణాలు మంజూరు చేశారు. మగవారికి ఈ విధమైన పొదుపు రుణాలు మంజూరు చేయడం తొలిసారని బ్యాంక్ అధికారులు చెప్పారు. కార్యక్రమంలో బ్యాంక్ సీనియర్ మేనేజర్ సుందరరావు, సిబ్బంది పద్మ, తదితరులు ఉన్నారు.

వలసల నివారణకే ఉపాధి పనులు


బొబ్బిలి రూరల్: పెంట గ్రామంలో వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు

మెంటాడ: గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు పెరుగుతున్న వలసల నివారణకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం పనులు కల్పిస్తున్నారని ఎంపీడీఓ త్రివిక్రమ్ అన్నారు. మండల కేంద్రంలోని అనంతసాగరం చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన సోమవారం పరిశీలించి, చెరువు ప్రధాన గట్టు ఏర్పాటు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. రెండు పూటలా కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు.

సంతకవిటి: స్థానిక ఉపాధి కార్యాలయంలో ఎన్‌ఆర్ ఈజీఎస్ ఏపీడీ పి.రాధ సోమవారం సిబ్బందితో సమావేశమై, ఉపాధి పనుల నిర్వహణపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె పనుల గుర్తింపులో జాప్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఏపీఓ త్రినాథరావు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట, రంగరాయపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ అల్లు భాస్కరరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వేతనదారుల మస్తర్లు చూసి, పలు సూచనలు చేశారు. కొలతల ప్రకారం పనులు చేయాలని, మస్తర్లు వేసిన తర్వాత పని ప్రదేశంలో వేతనదారులు లేకపోతే మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తూకంలో తేడాలు ఉంటే సహించేది లేదు


దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న మెట్రాలజీ అధికారులు

సీతంపేట: వినియోగదారులకు విక్రయిస్తున్న సరుకుల తూనికలు, కొలతల్లో వ్యత్యాసాలు ఉంటే సహించేది లేదని పలాస, పార్వతీపురం మన్యం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్లు టి.శ్రీధర్, రత్నరాజు అన్నారు. సోమవారం సీతంపేట వారపు సంతలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. తూకం గుళ్లపై సకాలంలో ముద్రలు వేయించుకోకుండా అక్రమాలకు పాల్పడుతున్న 10 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. సంతలోనే ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించి కాటాలు, తూకం గుళ్లపై సీల్స్ వేశారు. సీల్ లేని కాటాలు, తూకం గుళ్ల వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆర్తులకు అండగా సీఎం సహాయనిధి


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్తులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని తెట్టంగి గ్రామానికి చెందిన వండాన పావని అనారోగ్యం బాధపడుతుండడంతో ఆమె వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం సీఎం సహాయ నిధి నుంచి రూ.40 వేలు మంజూరు చేసింది. ఆ మొత్తాన్ని సోమవారం వండవ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కళావతి లబ్ధిదారు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి


వ్యాపారులతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్

పాలకొండ: నగరపంచాయతీలో ప్లాస్టిక్ విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని కమిషనర్ సర్వేశ్వరరావు వ్యాపారులను కోరారు. పట్టణంలోని వ్యాపారులతో సోమవారం సమావేశమయ్యారు. 120 మైక్రాన్‌ల కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్‌ను ప్రభుత్వం నిషేధించినందున వ్యాపారులు సహకరించాలని కోరారు. ఇక నుంచి ప్రతి రోజు తనికీలు చేపడతామని, ఎవరైనా నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపుల వద్ద ప్లాస్టిక్ కవర్లు అమ్మడం లేదని బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

అర్హులంతా ఓటరుగా నమోదు కావాలి



ఓటర్ సెల్ఫీ పాయింట్ ప్రారంభిస్తున్న ఆర్డీఓ శేషశైలజ

తెర్లాం: మండలంలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులంతా ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ డోల రాజేశ్వరరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఓటర్ సెల్ఫీ పాయింట్‌ను ఆర్డీఓ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఓటు అనేది భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ కల్పించిన హక్కు అని దీనిని అందరూ సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. తహసీల్దార్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఓటు ద్వారా నిజాయతీపరులైన ప్రజాప్రతినిధులను ఎన్నుకునే హక్కు ఓటర్‌కే సాధ్యమన్నారు. అనంతరం ఓటర్ సెల్ఫీ పాయింట్ వద్ద ఆర్డీఓ సెల్ఫీ తీసుకున్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ


గవరయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ: పట్టణంలో 8వ వార్డు కౌన్సిలర్ తూముల కళావతి, ఆమె భర్త కూరాకుల కుల కార్పొరేషన్ డైరెక్టర్ తూముల లక్ష్మణరావులను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పరామర్శించారు. కళావతి తండ్రి బొద్దాన గవరయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్సీతో పాటు కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, కొరికాన గంగునాయుడు, పల్లా భాను తదితరులున్నారు.

32 మంది ఉపాధ్యాయులకు సర్దుబాటు

వీరఘట్టం: మండలంలోని 62 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో 32 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు ఎంఈఓ పత్రి కృష్ణమూర్తి సోమవారం తెలిపారు. ఇందులో 19 మందికి సాధారణ ప్రక్రియలో సర్దుబాటు చేయగా, 13 మంది ప్రమోషన్లతో ఇతర పాఠశాలలకు బదిలీ చేసినట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా..


పరుగు పోటీలో పతకం సాధించిన మనోహర్‌తో కోచ్ రామకృష్ణ

సీతంపేట: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో సీతంపేట గిరిజన బాలుర గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థి సత్తా చాటాడు. ద్వితీయ సంవత్సరం విద్యార్థి వి.చిరంజీవి జావలెన్ త్రో క్రీడలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. విద్యార్థిని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విశ్వనాథం, పీడీ లక్ష్మణమూర్తి, అధ్యాపకులు సోమవారం అభినందించారు.

పరుగులో రజతం

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి బిడ్డిక మనోహర్ ప్రతిభ కనబరినట్లు కోచ్ బంగారి రామకృష్ణ సోమవారం తెలిపారు. ఈ నెల 22న శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 400 మీటర్ల పరుగు పోటీలో మనోహర్ ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడు.

ఉపాధి పనుల పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని తురకనాయుడువలసలో జరుగుతున్న ఉపాధి పనులను పీడీ కె.రామచంద్రరావు సోమవారం తనిఖీ చేశారు. మస్తర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రెండు పూటలా పనులకు హాజరుకావాలని, రోజువారీ వేతనం రూ.257 తగ్గకుండా పనులు చేయాలని వేతనదారులకు సూచించారు. పనులను దగ్గరుండి పర్యవేక్షించాలని, పనులకు హాజరుకాని వారికి మస్తర్లు వేస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఆయన వెంట ఈసీ తేజ, ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉన్నారు.